సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 28 । సెప్టెంబర్ । 2025



కొత్త మార్కింగ్‌తో నష్టం

ట్రిపుల్‌ఆర్ రోడ్డు నిర్మాణంలో కొత్త మార్కింగ్‌తో ఎక్కువ మంది రైతులు నష్టపోతున్నారని సీపీఎం నాయకులు అన్నారు. 10లో▸



రోడ్డు వేయాలని వినతి

తమ గ్రామానికి రోడ్డు వేయాలని జర్పుల తండావాసులు శనివారం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. 10లో▸



మృతదేహంతో ఆందోళన

వాగులో పడి మరణించిన వ్యక్తి మృతదేహంతో బీజేపీ నేతలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. 10లో▸

న్యూస్‌రీల్

రేపు ఉద్యోగ మేళా

తుక్కుగూడ: జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశం కల్పించడానికి ఈ నెల 29న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి జయశ్రీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని ఫాక్స్‌కాన్ కంపెనీలో పోస్టులు ఉన్నట్లు చెప్పారు. డిప్లొమా ఎలక్ట్రానిక్స్, మెకానిక్ ఇంజనీరింగ్ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. 18 నుంచి 30 సంవత్సరాలలోపు వయస్సు ఉన్నవారు అర్హులని తెలిపారు. వివరాలకు ఉపాధి కార్యాలయం, శాంతినగర్, ఐటీఐ క్యాంపస్, మల్లేపల్లి, హైదరాబాద్‌లో లేదా 90630 99306, 89771 75394 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నోయిడా నుంచి కన్హా వరకు



కన్హాకు చేరుకున్న తరుణ్ సర్కార్

నందిగామ: 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంపై అవగాహన పెంపొందించడంతో పాటు ధ్యానాన్ని ప్రోత్సహించేందుకు 56 ఏళ్ల వ్యక్తి ఉత్తర్‌ప్రదేశ్ నోయిడా నుంచి 14 రోజుల పాటు 1,700 కిలోమీటర్ల సైకిల్ యాత్ర చేపట్టి శనివారం కన్హా శాంతి వనానికి చేరుకున్నాడు. దేశ యువతను వ్యసనాల నుంచి దూరంగా ఉంచి, ధ్యానాన్ని ఆహ్వానించాలని పిలుపునిస్తూ నోయిడాకు చెందిన తరుణ్ సర్కార్ ఈ నెల 13న సైకిల్ యాత్ర ప్రారంభించాడు. మధుర, ఆగ్రా, గ్వాలియర్, వివపురి, గునా, బియావారా, భోపాల్, ఇటార్సి, బేతూల్, నాగ్‌పూర్, నిర్మల్, కామారెడ్డి మీదుగా కన్హాకు చేరుకున్నట్లు చెప్పారు. హార్ట్‌ఫుల్‌నెస్ గురూజీ కమ్లేష్ పటేల్ జన్మదినం సందర్భంగా ప్రపంచంలోని అతిపెద్ద ధ్యాన కేంద్రమైన కన్హా ఆశ్రమానికి చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా తరుణ్ సర్కార్‌ను కమ్లేష్ పటేల్ అభినందించారు.

కుర్మిద్దలో విషాదఛాయలు

యాచారం: కందుకూరు–మీరాఖాన్‌పేట గ్రామాల మధ్య శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, మరో పది మంది గాయాలపాలు కావడంతో వారి స్వగ్రామం కుర్మిద్దలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతి చెందిన వారితో పాటు క్షతగాత్రులంతా నిత్యం రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కూలీలు. గ్రామం నుంచి నిత్యం రావిరాల సమీపంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేయడానికి వెళ్తుంటారు. రోజు మాదిరిగా విధులు ముగించుకుని ఆటోలో వస్తున్న క్రమంలో రోడ్డుపై నిలిపి ఉన్న సిమెంట్ మిక్సర్ మిల్లర్‌ను ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న సురిగిరి శ్రీనివాస్ (39), పంది శ్రీధర్ (26), పంది సత్తమ్మ (49) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో పదిమంది గాయపడ్డారు. మృతదేహాలకు ఉస్మానియాలో పోస్టుమార్టం నిర్వహించి శనివారం రాత్రి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. అందరూ ఒకే గ్రామానికి చెందినవారు కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కొత్త కొత్వాల్‌గా వీసీ సజ్జనార్



సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు కమిషనర్‌గా 1996 బ్యాచ్ ఐపీఎస్ అధికారి విశ్వనాథ్ చెన్నప్ప సజ్జనార్‌ను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పని చేస్తున్న సీవీ ఆనంద్‌ను హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమించింది. రాష్ట్ర వ్యాప్తంగా 23 మంది ఐపీఎస్ అధికారుల బదిలీల నేపథ్యంలో.. హైదరాబాద్ కమిషనరేట్‌లో కీలక మార్పుచేర్పులు చోటు చేసుకున్నాయి. అదనపు సీపీగా (శాంతిభద్రతలు) పని చేస్తున్న విక్రమ్‌సింగ్ మాన్‌ను అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్‌గా నియమించింది. ఈ స్థానంలో తఫ్సీర్ ఇక్బాల్‌ను సంయుక్త సీపీ హోదాలో నియమించింది. ప్రస్తుతం సీఐడీలో ఐజీ హోదాలో ఉన్న ఎం.శ్రీనివాసులుకు అదనపు సీపీ (నేరాలు, సిట్)గా పోస్టింగ్ ఇచ్చింది. ఇక్కడ పని చేస్తున్న పి.విశ్వప్రసాద్ ఇటీవల తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) సభ్యులుగా నియమితులైన విషయం విదితమే. వెస్ట్‌జోన్ డీసీపీగా పని చేస్తున్న ఎస్ఎం విజయ్‌కుమార్ సిద్దిపేట పోలీసు కమిషనర్‌గా వెళ్తున్నారు. ఆ స్థానంలోకి రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ బదిలీ అయ్యారు. సిద్దిపేట సీపీ డాక్టర్ బి.అనురాధ ఎల్బీనగర్ జోన్ డీసీపీగా వస్తున్నారు. నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్ రాజేంద్రనగర్ డీసీపీగా బదిలీ అయ్యారు. ఏసీబీలో పని చేస్తున్న రితిరాజ్‌ను మాదాపూర్ డీసీపీగా ప్రభుత్వం నియమించింది.

'భవిష్యత్తు'కు బాటలు

ఫ్యూచర్ సిటీపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- ప్రపంచ బ్యాంకు, జైకా ఆర్థిక సహాయంతో అభివృద్ధి
- అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ మౌలిక సదుపాయాలు
- ఎలక్ట్రానిక్, ఏఐ, హెల్త్, లైఫ్ సైన్సెస్, ఎడ్యుకేషన్ జోన్లు
- నేడు ఎఫ్‌సీడీఏ భవనం, రేడియల్ రోడ్డుకు సీఎం శంకుస్థాపన



సాక్షి, రంగారెడ్డిజిల్లా: గ్రేటర్‌లో భారత్ ఫ్యూచర్ సిటీకి ఆదివారం ఉదయం అంకురార్పణ జరగబోతోంది. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ సిటీల తరహాలో ఈ కొత్త నగరానికి వడివడిగా బాటలు పడుతున్నాయి. ప్రపంచ బ్యాంకు సహా జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ (జైకా) ఆర్థిక సహాయంతో అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా ఫ్యూచర్‌సిటీ రూపుదిద్దుకోబోతోంది. ఇప్పటికే కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట కేంద్రంగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పనులను ప్రారంభించిన ప్రభుత్వం.. తాజాగా ఇదే కేంద్రంగా నిర్మించతలపెట్టిన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) పరిపాలన భవనాలు సహా గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు–1కు జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేయబోతున్నారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది.

56 గ్రామాలు.. 765 చదరపు కిలోమీటర్లు

మొత్తం 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్‌సిటీ (ఫోర్త్ సిటీ)ని తీర్చిదిద్దనున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు గ్రేటర్‌లోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు.. ఏడు మండలాలు.. 56 రెవెన్యూ గ్రామాలు..765 చదరపు కిలోమీటర్ల పరిధితో ఈ ఏడాది మార్చి 12న ఎఫ్‌సీడీఏను ఏర్పాటు చేసింది. సీనియర్ కలెక్టర్ శశాంకను కమిషనర్‌గా నియమించింది. కర్బన ఉద్గారాలు, ఇతర గ్రీన్‌హౌస్ వాయువులను పీల్చుకుని, మానవాళికి అవసరమైన ఆక్సిజన్‌ను ఇచ్చే వృక్ష సంపదను పెంచి, ఈ ప్రాంతాన్ని నెట్‌జీరో సిటీగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఇందుకోసం 15 వేల ఎకరాల్లో అర్బన్‌ఫారెస్ట్రీని అభివృద్ధి చేయనుంది.

13,973 ఎకరాలు.. పది జోన్లు

ప్రభుత్వం ఇప్పటి వరకు సేకరించిన 13,973 ఎకరాల భూమిని పది జోన్లుగా విభజించింది. దీనిలో 34 శాతం భూమిని ఎలక్ట్రానిక్స్ అండ్ జనరల్ పరిశ్రమలకు కేటాయించింది. ఆ తర్వాత లైఫ్‌సైన్స్ (ఫార్మా, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్) హబ్‌కు 30 శాతం ప్రాధాన్యం ఇచ్చింది. 9 శాతం భూమిని రెసిడెన్షియల్ మిక్స్‌డ్ యూజెస్ కోసం, మరో ఏడు శాతం రెసిడెన్షియల్ జోన్ కోసం కేటాయించింది. స్పోర్ట్స్ హబ్‌కు ఐదు, హెల్త్, ఎడ్యుకేషన్, వినోదం, పర్యాటకం కోసం మూడు శాతం చొప్పున, ఫర్నిచర్, ఏఐ సిటీల కోసం రెండు శాతం చొప్పున భూములు కేటాయించింది. ఈ మేరకు సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) కూడా సిద్ధం చేసింది. మీర్‌ఖాన్‌పేట్, బేగరికంచె, ముచ్చర్ల, పంజాగూడ రెవెన్యూల పరిధిలో ఫోర్త్‌సిటీతో పాటు దానికి ఇరువైపులా విద్య, వైద్యం, పర్యాటక, క్రీడా సంస్థల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇక జనావాసాలకు దూరంగా కుర్మిద్ద, కడ్తాల్ రిజర్వుడ్ ఫారెస్ట్‌కు ఆనుకుని ఉన్న భూములను ఫార్మా, ఆర్‌అండ్‌డీ పరిశ్రమలకు కేటాయించింది.

41.50 కి.మీ.. ఆరు లేన్లు

- రావిర్యాల ఇంటర్‌ఛేంజ్ నుంచి ఆమనగల్లు వరకు నిర్మించనున్న 41.50 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు (రతన్ టాటా రోడ్డు) పనులను రెండు ప్రముఖ నిర్మాణ సంస్థలు దక్కించుకున్నాయి. ఈ రోడ్డును రెండు దశలుగా నిర్మించనున్నారు.
- మొదటి దశలో రావిర్యాల నుంచి (టాటా ఇంటర్ చేంజ్) నుంచి మీర్‌ఖాన్‌పేట్ వరకు 19.2 కిలోమీటర్లు పూర్తి చేస్తారు. ఇందుకోసం రూ.1,665 కోట్లతో అంచనాలు రూపొందించారు.
- రెండో దశలో మీర్‌ఖాన్‌పేట్ నుంచి ట్రిపుల్‌ఆర్ వద్ద ఆమనగల్లు వరకు రూ.2,365 కోట్లతో 22.3 కిలోమీటర్లు నిర్మించనున్నారు. మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కందుకూరు, యాచారం, కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లోని 14 గ్రామాలకు ఈ రోడ్డుతో అనుసంధానం ఏర్పడనుంది.

రోడ్డు ప్రత్యేకతలు

- ఇది 100 మీటర్ల వెడల్పుతో కూడిన యాక్సెస్ కంట్రోల్డ్ ఎక్స్‌ప్రెస్ వే. ఆరు లేన్ల ప్రధాన రహదారి (3+3 లేన్)
- ఈ రహదారిని భవిష్యత్తులో 8 లేన్లకు (4+4) విస్తరించే అవకాశం ఉంది.
- ఈ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు మధ్యలోనే మెట్రో కారిడార్ కోసం 20 మీటర్ల భూమిని కేటాయిస్తారు. ఈ మార్గంలో ఎట్ గ్రేడ్ (భూమార్గంలో) గా మెట్రో కారిడార్ రానుంది.
- గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు రెండు వైపులా 3–లేన్ల సర్వీస్ రోడ్లు ఉంటాయి. 2 మీటర్ల చొప్పున గ్రీన్‌బెల్ట్‌ను (పచ్చదనం) ఏర్పాటు చేస్తారు.
- రెండు వైపులా 3 మీటర్ల సైకిల్ ట్రాక్ నిర్మించనున్నారు. అలాగే 2 మీటర్ల వెడల్పుతో ఫుట్‌పాత్ ఉంటుంది. మరో 2 మీటర్ల యుటిలిటీ కారిడార్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు.

కొండా లక్ష్మణ్ త్యాగం మరువలేనిది



మహేశ్వరం: కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: తెలంగాణ ఉద్యమానికి కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన త్యాగం మరువలేనిదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పేర్కొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో శనివారం ఆయన విగ్రహాన్ని పద్మశాలీ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 1969లో తొలి దశ పోరాటంలోనే కీలక పాత్ర పోషించి, మంత్రి పదవిని కూడా త్యజించిన త్యాగశీలి బాపూజీ అని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల కోసం ఆయన చేసి కృషి అభినందనీయమన్నారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనపై కొండా లక్ష్మణ్ బాపూజీ అలుపెరగని పోరాటం చేశారన్నారు. ఆయన సిద్ధాంతాలను, ఉద్యమ స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్ గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు బి.శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు కె.మనోహర్, మాజీ ఎంపీపీ ఎం.స్వప్న, శివగంగ ఆలయ మాజీ చైర్మన్ ఎం.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతిరూపం కొండా బాపూజీ

ఇబ్రహీంపట్నం రూరల్: త్యాగానికి ప్రతి రూపం కొండా లక్ష్మణ్ బాపూజీ అని కలెక్టర్ సి.నారాయణరెడ్డి పేర్కొన్నారు. 110వ జయంతి సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లో వెనుకబడిన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళి అర్పించారు. స్వరాష్ట్ర సాధన కోం, బలహీన వర్గాల బలోపేతానికి కృషి చేశారని కొనియాడారు. తెలంగాణవచ్చే వరకు ఎలాంటి పదవులు అనుభవించకుండా త్యాగం చేశారన్నారు. నేటి తరానికి మార్గదర్శకులుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి కేశురాం, బీసీ సంఘాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఈ మేరకు 45 మంది పేర్లతో కూడిన జాబితాను శనివారం విడుదల చేసింది. అధ్యక్షుడిగా శేరిబాయి గణేశ్, కార్యదర్శిగా మైల సైదులు, కోశాధికారిగా వడ్ల శ్రీనివాసాచారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సిర్సవాడ చంద్రశేఖర్, శ్రీశైలం, మణికుమార్, వేణుగోపాల్, సుదర్శన్, రాందాస్, రాజు, శ్రీనివాస్ ఎన్నికైనట్లు ప్రకటించింది. సహాయ కార్యదర్శులుగా వెంకటేశ్, ఆర్.నరసింహ, రాఘవేందర్‌గౌడ్, మన్సూర్ అలీఖాన్, ప్రభాకర్, శ్రీనివాస్, సత్యనారాయణ, సురేష్ ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఖాజాపాషా, శ్రీనివాస్, ఆనంద్, ఆంజనేయులు, రఘుపతి, అశోక్‌గౌడ్, రమేష్, జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా దేవేందర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఫెడరేషన్ పేర్కొంది.

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమిద్దాం

డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్

ఇబ్రహీంపట్నం: భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో అసమానతలు లేని సమాజం కోసం ఉద్యమిద్దామని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేశ్ పిలుపునిచ్చారు. భగత్ సింగ్ 118వ జయంతిని పురస్కరించుకొని ఇబ్రహీంపట్నంలో శనివారం డీవైఎఫ్ఐ అధ్వర్యంలో భగత్‌సింగ్ సందేశ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, భారతదేశ విముక్తి కోసం స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం 23 ఏళ్ల ప్రాయంలోనే ఉరి కొయ్యకు ప్రాణాలర్పించిన వీర కిషోరం భగత్‌సింగ్ అని కొనియాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భగత్‌సింగ్ ఆలోచనలకు విరుద్ధంగా మతోన్మాద విధానాలతో తినే తిండి, కట్టే బట్టపై ఆంక్షలు విధిస్తోందని ఆరోపించారు. భగత్‌సింగ్ జీవిత చరిత్రను కనుమరుగు చేసేందుకు యత్నిస్తోందని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భగత్‌సింగ్ జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.జగన్, నాయకులు జంగయ్య, రాఘవేందర్, మహేశ్, వినోద్, లింగం, తరంగ్, శ్రీకాంత్, వంశీ, శివ పాల్గొన్నారు.



భగత్‌సింగ్ సందేశ్ ర్యాలీ నిర్వహిస్తున్న డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నేతలు

జెడ్పీ పీఠం ఎస్సీ మహిళకే..

- గెజిట్ జారీ చేసిన ప్రభుత్వం
- 20 ఏళ్ల తర్వాత మళ్లీ ఆ సామాజిక వర్గానికి
- పరిషత్ రిజర్వేషన్లు ఖరారు
- 21 జెడ్పీటీసీ స్థానాల్లో తొమ్మిది బీసీలకు
- మూడు ఎస్టీ.. నాలుగు ఎస్సీలకు
- జనరల్ కేటగిరీలో ఐదు స్థానాలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎట్టకేలకు ఉత్కంఠకు తెరపడింది. జెడ్పీ పీఠం ఎస్సీ మహిళకు దక్కింది. ఈ మేరకు ప్రభుత్వం గెజిట్ జారీ చేసింది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ ఇప్పటికే ప్రభుత్వం జీఓ జారీ చేసిన విషయం తెలిసిందే. జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని ఎస్సీ మహిళకు కేటాయిస్తూ గెజిట్ జారీ చేయడంతో ఇందుకు అనుగుణంగా ఆయా రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపికలో తలమునకలయ్యాయి. పరిషత్ ఎన్నికల్లో పోటీ చేసి, జెడ్పీ పీఠాన్ని కైవసం చేసుకోవాలని భావించిన ఆశావహులు తీరా రిజర్వేషన్లు మారిన విషయం తెలిసి తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు ఇప్పటికే భారీగా ఖర్చు చేసిన ఆయా నేతలు తమకు పోటీ చేసే అవకాశం లేకుండా పోయిందనే విషయం తెలిసి ఆందోళనకు గురయ్యారు.

20 ఏళ్లుగా జనరల్‌కే..

1978 ఆగస్టు 15న జిల్లా ఏర్పాటైంది. ఎన్టీఆర్ తెలుగు దేశం పార్టీని స్థాపించడం, పాలనవికేంద్రీకరణలో భాగంగా స్థానిక సంస్థలను ఏర్పాటు చేయడం, వాటికి ఎన్నికలు నిర్వహించడం తెలిసిందే. జిల్లా పరిషత్‌కు తొలిసారిగా నిర్వహించిన ప్రత్యక్ష ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కేఎస్ రత్నం ఎన్నికయ్యారు. ఆయన తర్వాత అదే పార్టీకి చెందిన ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన కాసాని జ్ఞానేశ్వర్ ఎన్నికయ్యారు. తర్వాత మహిళా జనరల్ కేటగిరీలో పట్నం సునీతా మహేందర్‌రెడ్డి వరుసగా రెండు పర్యాయాలు చైర్‌పర్సన్‌గా పని చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత మహేశ్వరం నుంచి జెడ్పీటీసీ అ భ్యర్థి తీగల అనితారెడ్డి బీఆర్ఎస్ మద్దతుతో ఈ పీఠాన్ని కైవసం చేసుకున్నారు. 20 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ స్థానం ఎస్సీకి రిజర్వ్ కావడం విశేషం. అది కూడా మహిళకు కేటాయించడం కొసమెరుపు.

21 స్థానాల్లో 9 బీసీలకు కేటాయింపు

జిల్లా పరిషత్‌లకు రిజర్వేషన్లు దాదాపు ఖరారయ్యాయి. జాబితాను అధికారంగా వెల్లడించాల్సి ఉంది. జిల్లాలో 21 జెడ్పీటీసీ స్థానాలు ఉండగా, వీటిలో తొమ్మిది చొప్పున బీసీలకు కేటాయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఐదు స్థానాలను జనరల్ కేటగిరీలో, నాలుగు స్థానాలు ఎస్సీలకు, మూడు స్థానాలు ఎస్టీలకు కేటాయించారు. మంచాల (జనరల్), కొత్తూర్ (జనరల్), ఫరూఖ్‌నగర్ (మహిళ) స్థానాలను ఎస్టీ సామాజిక వర్గానికి కేటాయించగా, శంకరపల్లి (జనరల్), చేవెళ్ల (జనరల్), కందుకూరు(మహిళ), షాబాద్ (మహిళ) స్థానాలను ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించారు. ఇక మొయినాబాద్ (మహిళ), కొందుర్గు (జనరల్), ఇబ్రహీంపట్నం (మహిళ), కేశంపేట (మహిళ), యాచారం (జనరల్), మహేశ్వరం (మహిళ), తలకొండపల్లి (జనరల్), మాడ్గుల (జనరల్), కడ్తాల్ (మహిళ) స్థానాలను బీసీ సామాజిక వర్గానికి కేటాయించినట్లు తెలిసింది. ఇక అబ్దుల్లాపూర్‌మెట్, చౌదరిగూడ, నందిగామ, శంషాబాద్, ఆమనగల్లు స్థానాలు జనరల్ కేటగిరీకి కేటాయించినట్లు తెలిసింది.

రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి

జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయిందని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డితో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మహిళా రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ రిజర్వేషన్లకు సంబంధించి మహిళా రిజర్వేషన్ కోసం లాటరీ పద్ధతిన కేటాయింపు నిర్వహించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు, బీసీ డెడికేషన్ కమిటీ నివేదిక ప్రకారం బీసీ రిజర్వేషన్లు చేపట్టినట్లు తెలిపారు. 21 జెడ్పీటీసీ స్థానాల్లో మూడు ఎస్టీ, నాలుగు ఎస్సీ, తొమ్మిది బీసీ, ఐదు జనరల్ కేటగిరీలకు కేటాయించినట్లు తెలిపారు. ఇదే ప్రాతిపదికన ఎంపీపీ స్థానాలకు కూడా రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు చెప్పారు. సంబంధిత రిజర్వేషన్ స్థానాల కేటాయింపు వివరాలను ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందన్నారు. జిల్లా పరిషత్, మండల పరిషత్‌లలో తొమ్మిది చొప్పున స్థానాలను మహిళలకు కేటాయించినట్లు వివరించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



లాటరీ తీస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

మైసిగండికి ట్రస్ట్ బోర్డు!

- వడివడిగా పడుతున్న అడుగులు
- ఇప్పటికే దేవాదాయ శాఖ నోటిఫికేషన్
- సభ్యుల నియామకానికి ఉత్తర్వులు జారీ
- పదవి కోసం ఆశావహుల ప్రయత్నాలు



మైసిగండి మైసమ్మ దేవాలయం

కడ్తాల్: దక్షిణ తెలంగాణలోనే అత్యంత పేరుగాంచిన మైసిగండి మైసమ్మ శివాలయ, రామాలయ దేవస్థానం ట్రస్ట్ బోర్డు (నాన్‌- హెరిడిటరీ) ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. ఇప్పటికే దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, మైసిగండి మైసమ్మ దేవత, శివ రామాలయాల ట్రస్ట్ బోర్డు సభ్యుల నియామకం కోసం ఈనెల 16న నోటిఫికేషన్ జారీ చేశారు. మైసిగండి మైసమ్మ ఆలయానికి ఏడాదికి రూ.50 లక్షల నుంచి రూ.కోటికి పైగా ఆదాయం సమకూరుతోంది. వార్షిక ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకోగా 6ఏ ఆలయ హోదా పొందింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాలకు పాలక మండళ్లు నియమించేందుకు దేవాదాయ శాఖ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా మైసిగండి మైసమ్మ ఆలయానికి ట్రస్ట్ బోర్డు సభ్యుల నియామకానికి చర్యలు ప్రారంభించింది. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్ ఆదేశాల మేరకు అధికారులు ఇప్పటికే త్తర్వులు జారీ చేశారు.

వార్షికాదాయం ప్రకారం..

దేవాలయాల వార్షికాదాయం ప్రకారం పాలకమండలి సభ్యులను నియమించనున్నట్లు సమాచారం. వార్షికాదాయం రూ.2 లక్షలు మొదలు రూ.25 లక్షలు ఉంటే ఏడుగురు సభ్యులు, రూ.25 లక్షల నుంచి రూ.కోటికి పైగా ఉంటే 14 మంది సభ్యులను నియమించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో వార్షికాదాయం రూ.50 లక్షల నుంచి రూ.కోటి ఆపైన ఆదాయం ఉన్న మైసిగండి మైసమ్మ ఆలయానికి 14 మంది సభ్యులను నియమించే అవకాశం ఉంది. పాలక మండలి సభ్యులుగా నియమితులైన వారు ఏడాది పాటు పదవిలో కొనసాగనున్నారు. దేవాదాయ శాఖ గైడ్‌లైన్స్ ప్రకారం నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత ఆసక్తి, అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలి. కమిషనర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ హైదరాబాద్, జాయింట్ కమిషనర్ హైదరాబాద్, డిప్యూటీ కమిషనర్ హైదరాబాద్ జోన్, సహాయ కమిషనర్ దేవాదాయ ధర్మాదాయ కమిషనర్ రంగారెడ్డికి నిర్ణీత నమూనాలో పంపించాలని అధికారులు సూచిస్తున్నారు.

ట్రస్ట్ బోర్డు ఏర్పాటుతో అభివృద్ధి

ఆది, మంగళ, గురువారాల్లో వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. ప్రత్యేకించి ఆలయం స్థానిక బంజారా ప్రజల సాంస్కృతిక, ఆధ్యాత్మిక భావాలను ప్రతిబింబిస్తోంది. ఆలయం మరింత అభివృద్ధి చెందేందుకు పాలకమండలి సభ్యుల నియామకం దోహదపడుతుందని స్థానికులు, భక్తులు అభిప్రాయపడుతున్నారు. ఆలయ నిర్వహణ, భక్తులకు సౌకర్యాలు, ఆర్థిక వ్యవహారాల నిర్వహణ, పారదర్శకత, జవాబుదారీ తనం పెరుగుతుందని ఆశిస్తున్నారు.

ఎవరికి వారు పైరవీలు

ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుల పదవి కోసం ఆశావహులు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, సామాజిక సేవ, ధార్మిక సంస్థలకు చెందిన పలువురు పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. తమకు ఉన్న పరిచయాలతో ఆయా స్థాయిల్లో ప్రముఖులను ప్రసన్నం చేసుకునే పని ప్రారంభించారని వినికిడి. నేతల ఆశీస్సులు ఎవరి ఉంటాయో వారినే పదవులు వరించే అవకాశం ఉండడంతో, ఆ దిశగా తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారని ప్రచారం సాగుతోంది.

కొత్త మార్కింగ్‌తో రైతులకు నష్టం



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన సీపీఎం నాయకులు, రైతులు

సీపీఎం జిల్లా నాయకుడు రాజు

షాద్‌నగర్‌రూరల్: ట్రిపుల్ ఆర్ రోడ్డు నిర్మాణంలో కొత్త మార్కింగ్‌తో ఎక్కువ మంది పేద రైతులు భూములు కోల్పోతున్నారని సీపీఎం జిల్లా నాయకుడు రాజు అన్నారు. శనివారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ట్రిపుల్‌ఆర్ బాధిత రైతులకు మద్దతుగా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని భీమారం, అయ్యవారిపల్లి, ఉప్పరిగడ్డతాండ, కేశంపేట మండల పరిధిలోని నిడదవెల్లి, తొమ్మిదిరేకుల, కొందుర్గు మండల పరిధిలోని తంగెళ్లపల్లి, చెరుకుపల్లి, తుమ్మలపల్లి గ్రామాలకు చెందిన రైతులు తరలివెళ్లి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ట్రిపుల్ ఆర్ నిర్మాణానికి అలైన్‌మెంట్‌ను ఇస్తున్నట్లు రూట్ మ్యాప్‌తో పాటుగా సర్వే నంబర్లను ప్రకటించడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఎకరం, రెండు ఎకరాల భూమి ఉన్న పేద రైతులే అధికంగా ఉన్నారని, వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న రైతులు భూములను కోల్పోతుండటంతో వారి జీవనోపాధి అగమ్యగోచరంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు పెట్టుబడిదారుల ప్రయోజనాలకోసం పేదల భూములను లాక్కొని వారి పొట్టకొట్టొద్దని ఆగ్రహం వెళ్లిబుచ్చారు. పాత అలైన్‌మెంట్ ప్రకారమే రీజినల్ రింగ్ రోడ్డు నిర్మించాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. కలెక్టరేట్‌కు తరలిన వారిలో సీపీఎం నాయకులు జగన్, రాజు, కుర్మయ్య, వెంకటయ్య, రైతులు లక్ష్మయ్య, నగేష్, శ్రీనివాస్, చంద్రకాంత్, రమేష్, రాంసింగ్, రాజు, రాంజీనాయక్, రవినాయక్, అమృనాయక్, మంగ్యనాయక్, పాండునాయక్, బద్రినాయక్ తదితరులు ఉన్నారు.

ప్రయాణికుడి వద్ద విదేశీ బల్లులు, తాబేళ్ల పట్టివేత

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో భద్రతాధికారుల తనిఖీల్లో ఓ ప్రయాణికుడి వద్ద విదేశీ బల్లులు, తాబేళ్లు స్వాధీనం చేసుకున్నారు. వివరాలివీ... శనివారం సాయంత్రం ఇండిగో విమానం 6ఈ–1068లో విమానంలో బ్యాంకాక్ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న లోకేష్ జయచంద్రన్ అనే ప్రయాణికుల లగేజీని అధికారులు తనిఖీ చేశారు. అందులో 8 కీలేడ్ బల్లులు, ఒక గిర్డిల్ బల్లి, ఒక రెండు తలలు కలిగిన తాబేలు బయటపడ్డాయి. దీంతో ప్రయానికుడిపై వన్య ప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేశారు. తీసుకొచ్చిన జీవులకు మరో విమానంలో బ్యాంకాక్‌కు తిరిగి పంపారు.



ప్రయాణికుడి వద్ద పట్టుబడిన బల్లులు

చైతన్యయాదవ్ అంత్యక్రియలు పూర్తి



చైతన్యయాదవ్ (ఫైల్)

బడంగ్‌పేట్: కార్పోరేషన్ పరిధి నాదర్‌గుల్‌కు చెందిన తల్లిదండ్రులు ఐలయ్య యాదవ్, మంగమ్మ దంపతుల కుమారుడు చైతన్యయాదవ్ అలియాస్ అభి (22) ఈ నెల 1వ తేదీన బ్రిటన్‌లో రోడ్డు ప్రమాదానికి దుర్మరణం చెందిన విషయం విదితమే. ఈ మేరకు శుక్రవారం రాత్రి మృతదేహం ఇంటికి రావడంతో శనివారం అశ్రునయనాల మధ్య నాదర్‌గుల్ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

చెరువులను కాపాడుకోవాలి

ఇంగ్లండ్ హై కమిషనర్



చెరువు క్లీనింగ్‌లో పాల్గొన్న యూకే హై కమిషనర్

మణికొండ: మన పరిసరాల్లో ఉన్న చెరువులను కాపాడుకోవటంతో పాటు వాటిని పరిశుభ్రంగా ఉంచుకుని వాటి వద్ద సేద తీరాలని ఇంగ్లండ్ (యూకే) హై కమిషనర్ గరేత్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేట కొత్త చెరువు వద్ద ధృవాన్ష్ ఎన్‌జీఓ వారు నిర్వహించిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చెరువులను సుందరంగా తయారు చేసుకుని వాటి వద్ద ప్రజలు మంచి వాతావరణాన్ని ఆస్వాదించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన చెరువు పరిసరాల్లో పడిన చెత్తను తొలగించారు. ధృవాన్ష్ ఎన్‌జీఓ చేస్తున్న క్లీనింగ్ పనులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ధృవాన్ష్ ఎన్‌జీఓ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వరదలో కొట్టుకుపోయిన వ్యక్తి..

శవమై తేలాడు
- మృతదేహంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బైఠాయించిన బీజేపీ నేతలు
- ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

షాద్‌నగర్‌రూరల్/కొందుర్గు: వాగులో పడి మృతి చెందిన దస్తగిరి లింగమయ్య(42) మృతదేహంతో బీజేపీ నేతలు శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆందోళన చేశారు. దీంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. వివరాలు.. కొందుర్గు మండల పరిధిలోని వెంకిర్యాల గ్రామానికి చెందిన లింగమయ్య శుక్రవారం విశ్వనాథ్‌పూర్ వద్ద వాగుదాటుతూ కొట్టుకుపోయాడు. శనివారం ఉదయం మృతదేహం లభ్యమైంది.



క్యాంపు కార్యాలయం ఎదుట బైఠాయించిన బీజేపీ నేతలు, మృతుడి కుటుంబ సభ్యులు

మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

లింగమయ్య మృతదేహం, వారి కుటుంబ సభ్యులతో కలిసి శనివారం బీజేపీ నేత ప్రశాంత్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బైఠాయించారు. ప్రభుత్వం వాగుపై బ్రిడ్జి నిర్మించకపోవడంతోనే లింగమయ్య మృతి చెందాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ విజయ్‌కుమార్ పోలీసు సిబ్బందితో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకొని ఆందోళనకారులను అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు. క్యాంపు కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు యత్నించిన బీజేపీ కార్యకర్తలను చెదరగొట్టారు. అనంతరం ప్రశాంత్ మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రశాంత్‌ను సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు.

రోడ్డు వేయాలని వినతి

మాడ్గుల: తమ గ్రామానికి రోడ్డు వేయాలని జర్పుల తండావాసులు శనివారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాన రహదారి నుంచి రెండు కిలోమీటర్ల మేర రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నామని.. బురదమయంగా ఉండడంతో వాహనాల రాకపోకలు అంతరాయం కలుగుతుందన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జర్పుల విజయ్, బాలు, జంగు, మదీన, రాజశేఖర్, కుమార్, శివ తదితరులు ఉన్నారు.



అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్పుల తండావాసులు

లారీని ఢీకొట్టిన కారు

యువకుడి దుర్మరణం
- మరొకరికి తీవ్రగాయాలు

కొత్తూరు: లారీని కారు వెనుక నుంచి ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడు తీవ్రగాయాలపాలయ్యాడు. ఈ ఘటన మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్‌లో ఐటీసీఎల్ ప్లాంట్ ఎదుట చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఈ నెల 26న షాద్‌నగర్‌కు చెందిన అభిషేక్(22) తన మిత్రుడు కిషోర్‌తో కలిసి కారులో శంషాబాద్ నుంచి షాద్‌నగర్ ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో కారు నడుపుతున్న కిషోర్ తిమ్మాపూర్ శివారు ఐటీసీఎస్ ప్లాంట్ వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్ పక్కసీట్లో కూర్చున్న అభిషేక్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందగా.. గాయపడిన కిషోర్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అనంతరం పోలీసులు మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ట్రాఫిక్ 'ముంచెత్తింది'!

- మూసీ వరద ఉధృతితో కొన్ని కాజ్‌వేలు క్లోజ్
- ఆర్టీసీ బస్సుల స్టార్టింగ్ పాయింట్లూ మార్పు

సాక్షి, సిటీబ్యూరో: మూసీ నది ఉగ్రరూపం దాల్చడంతో సిటీలోని మూడు ప్రధాన రహదారులతో పాటు మహాత్మా గాంధీ బస్ స్టేషన్‌ను (ఎంజీబీఎస్) మూసివేశారు. ఈ ప్రభావం నగరంలోని ట్రాఫిక్‌పై తీవ్రంగా పడింది. అనేక ప్రాంతాల్లో గంటల తరబడి వాహనాలు రోడ్లపై నిల్చిపోయాయి. దీనికితోడు వర్షాలకు కొన్ని చోట్ల రోడ్లు కూడా ఛిద్రం కావడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. మొత్తమ్మీద పండుగ సీజన్‌లో నగవాసి నరకం చవిచూడాల్సి వచ్చింది. మూసీలో వరద ఉధృతితో శుక్రవారం రాత్రి నుంచి కుల్సుంపుర–పురానాపూల్ మధ్య ఉన్న 100 అడుగుల రోడ్డు, చాదర్‌ఘాట్ కాజ్ వే, మురసాంబాగ్ కాజ్‌వేలను పూర్తిగా మూసేశారు. శనివారం ఉదయం నుంచి ఈ మార్గాల్లో నడిచే వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లో పంపించారు. దీని ప్రభావం దిల్‌సుఖ్‌నగర్ నుంచి కోఠి వరకు కనిపించింది. ఇటు వాహనాలు అటు వెళ్లడానికి నాగోలు వంతెన తర్వాత కేవలం చాదర్‌ఘాట్ బ్రిడ్జ్ మాత్రమే ఉండటంతో పరిస్థితి తీవ్రంగా మారింది. పురానాపూల్ వంతెన మూసివేత ప్రభావమూ ఎక్కువగానే చూపింది. మరోపక్క శుక్రవారం రాత్రి ఎంజీబీఎస్ మునిగిపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సులు బయలుదేరే ప్రాంతాన్ని ఆరాంఘర్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఉప్పల్ తదితర ప్రాంతాలకు మార్చారు. దీంతో ఆయా మార్గాల్లో ప్రయాణించే వాహనాలకు అదనంగా ఈ బస్సులు తోడు కావడంతో రహదారిపై పరిస్థితి దారుణంగా తయారైంది.

వైద్యురాలిని 'చంపిన' కేసులో ఇరువురి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: డిజిటల్ అరెస్టు స్కామ్ ద్వారా రిటైర్డ్ ప్రభుత్వం వైద్యురాలి మరణానికి కారణమైన కేసులో సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. మధురానగర్‌కు చెందిన ఓ వృద్ధురాలు (76) చంచల్‌గూడ ఆఫీసర్స్ కాలనీలో ఉన్న మామిడిపూడి నాగార్జున ఏరియా ఆస్పత్రి నుంచి పదవీ విరమణ పొందారు. బెంగళూరు పోలీసుల పేరు చెప్పి మనుషుల అక్రమ రవాణా వ్యవహారానికి సంబంధించి కేసు నమోదైందని చెప్పారు. ఈ కేసు షాదత్ ఖాన్ హ్యూమన్ ట్రాఫికింగ్ కేసుకు అనుబంధంగా నమోదైందని భయపెట్టి డిజిటల్ అరెస్టు చేశారు. ఆమె నుంచి రూ.6.6 లక్షలు కాజేసినప్పటికీ సెప్టెంబర్ 8 వరకు 'నిర్బంధం'లో ఉంచారు. ఆ ఒత్తిడితో గుండెపోటుకు గురైన బాధితురాలు చికిత్స పొందుతూ చనిపోయారు. కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తునకు ప్రాధాన్యం ఇచ్చారు. ఇన్‌స్పెక్టర్ మట్టం రాజు నేతృత్వంలోని బృందం సూత్రధారులకు బ్యాంకు ఖాతాలు అందించిన మహారాష్ట్ర వాసులు శంకర్ సుపూర్, విశ్వాస్ దత్తాత్రేయ మిరాజ్‌లను అరెస్టు చేసి తీసుకువచ్చారు. మరోపక్క ఓ ప్రైవేట్ కంపెనీ ఎండీ ఫొటోను డీపీగా పెట్టుకున్న సైబర్ నేరగాళ్లు రూ.25 లక్షలు కాజేశారు. కంపెనీ ఎండీ శ్రీలంక వెళ్లడంతో ఆయనకు చెందిన కొత్త నెంబర్ అంటూ వాట్సాప్ సదరు కంపెనీ మేనేజర్‌తో చాటింగ్ చేశారు. తొలుత తమ ఖాతాల్లోకి రూ.25 లక్షలు బదిలీ చేయించుకున్నారు. అదనంగా మరో రూ.40 లక్షలు డిమాండ్ చేయడంతో అనుమానం వచ్చిన మేనేజర్ తన యజమానిని ఫోన్ ద్వారా సంప్రదించి విషయం తెలుసుకున్నారు. దీనిపై సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో శనివారం కేసు నమోదైంది.

ఓఆర్ఆర్‌పై ప్రమాదం

వ్యక్తి దుర్మరణం

మణికొండ: ఓఆర్ఆర్‌పై రోడ్డు దాటుతున్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన నార్సింగి ఠాణా పక్కనే జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి నార్సింగిలోని గండిపేట ఫ్లైఓవర్ కింద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం అతన్ని వేగంగా ఢీ కొట్టింది. దాంతో అతను కొద్ది దూరం ఎగిరిపడటంతో తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి ఎవరు, అతన్ని ఢీ కొట్టిన వాహనం గురించి విచారణ చేస్తున్నామని, వివరాలు తెలిస్తే నార్సింగి పోలీస్ స్టేషన్ 87125 71928, 94910 39034 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

అలుగు ప్రవాహంలో కొట్టుకుపోయిన వ్యక్తి

మృతదేహం లభ్యం

బంట్వారం: అలుగు ప్రవాహంలో కొట్టుకుపోయిన ఓ వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. బంట్వా రం ఎస్ఐ విమల తెలి పిన ప్రకారం.. కోట్‌పల్లి మండలం కొత్తపల్లికి చెందిన చింతకింది రవికుమార్ (35), ప్రేమ్‌కుమార్ ఇద్దరూ కలిసి శుక్రవారం రాత్రి బైక్‌పై బంట్వారం మండలం సుల్తాన్‌పూర్‌కు వెళ్లా రు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా కొత్తపల్లి చె రువు అలుగు ఉధృతిలో బైక్ అదుపు తప్పి ఇద్ద రూ కింద పడ్డారు. ఆ సమయంలో సుల్తాన్‌పూ ర్ గ్రామస్తులు చెరువు గట్టు వద్ద నుంచి గమనించి ప్రేమ్‌కుమార్‌ను కాపాడారు. రవికుమార్ మాత్రం అలుగు ప్రవాహంలో కొట్టుకుపోయాడు. శనివారం పోలీసులకు సమాచా రం అందడంతో ఎస్ఐ విమల సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్య లు చేపట్టారు. కిలో మీటరు దూరంలో రవికుమార్ మృతదేహన్ని గుర్తించి స్థానికుల సహాయంతో బయటికి తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పో స్టుమార్టం నిర్వహించి మృతదేహన్ని బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

గ్రూప్-1 ఉద్యోగిగా తాండూర్ ఎక్సైజ్ సీఐ

తాండూరు: తాండూరు ఎక్సైజ్ సీఐ ఆదిశేషిరెడ్డి గ్రూప్–1 ఫలితాల్లో డీఎస్పీగా ఎంపికయ్యా రు. ఎక్సైజ్ శాఖ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఆదిశేషిరెడ్డి తాండూరు ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మార్చిలో వెలువడిన గ్రూప్–1 ఫలితాల్లో ఆదిశేషిరెడ్డి ఉత్తమ ర్యాంకు సాధించడంతో పోలీసు శాఖలో డీఎస్పీగా ఎంపికయ్యారు. శనివారం శిల్పకళావేదికలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన నియామకపత్రాలు అందుకున్నారు.

మంత్రి సీతక్క కేసు విచారణ వాయిదా

సిటీ కోర్టులు: కరోనా వ్యాధిని ఆరోగ్యశ్రీలో చేర్చాలని హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద 2021 ఏప్రిల్‌లో ధర్నా సందర్భంగా అప్పటి ములుగు ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి సీతక్కపై నమోదైన కేసు విచారణ శనివారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో జరిగింది. సీతక్కతోపాటు అప్పటి ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రస్తుత ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు రంజిత్, విధుర్ చావ్లా, అభిజిత్ యాదవ్‌పై అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పోలీసులు 188, 269, 270 ఐపీసీ కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసు విచారణకు సీతక్క గైర్హాజరు కాగా ఆమె తరుపు న్యాయవాది కుర్మ నరేందర్ పిటిషన్ దాఖలు చేశారు. మిగతా నాయకులు కోర్టుకు హాజరయ్యారు. సీతక్క గైర్హాజరు కావడంతో తదుపరి విచారణలో అందరూ ఎగ్జామినేషన్‌కు హాజరు కావాలని సూచిస్తూ విచారణను వచ్చే నెల 18కి కోర్టు వాయిదా వేసింది.

అనంతుడి సేవలో హైకోర్టు జడ్జి

- పూర్ణకుంభంతో స్వాగతం పలికిన అర్చకులు

అనంతగిరి: వికారాబాద్ సమీపంలోని అనంతగిరి గుట్టపై వెలసిన శ్రీ అనంత పద్మనాభస్వామిని శనివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి, వికారాబాద్ జిల్లా పోర్ట్‌పోలియో జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు దర్శించుకున్నారు. ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చరిత్ర, దేవుని మహత్యం గురించి ప్రధాన అర్చకులు వివరించారు. తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు ఇచ్చి జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆయన వికారాబాద్ కోర్టు భవన సముదాయాన్ని సందర్శించారు. జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. జిల్లా కోర్టు ఆవరణలో మరో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు మంజూరు చేయాలని కోరారు. మంజూరైన జిల్లా కోర్టు నూతన భవనాన్ని త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి హైకోర్టు జడ్జిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్. సున్నం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శాంతిలత, పరిగి జూనియర్ సివిల్ జడ్జి ఎస్ శిల్ప, కొడంగల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీరామ్, తాండూరు జూనియర్ సివిల్ జడ్జి శివలీల, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజ్ పటేల్ పాల్గొన్నారు.



స్వామివారి సన్నిధిలో హైకోర్టు జడ్జి రాజేశ్వర్‌రావు తదితరులు

బలవంతపు భూ సేకరణ వద్దు

- సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్

అనంతగిరి: రైతుల అనుమతి లేకుండా బలవంతంగా భూములు సేకరిస్తే పోరాటం తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చడం ద్వారా రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. పేదల పొలాల్లో రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రింగ్ రోడ్డు వేయడమేంటని ప్రశ్నించారు. రైతుల అభిప్రాయం తీసుకోకుండా భూములు తీసుకోవద్దని సూచించారు. పాత అలైన్‌మెంట్ ప్రకారమే రోడ్డు వేయాల ని డిమాండ్ చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, సత్యనారాయణ, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు